క్లుప్తంగా

రేపు సింగర్స్ సొసైటీ వార్షికోత్సవం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఆనం కళాకేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు సింగర్స్ ఫ్రెండ్స్ సొసైటీ (ఎస్‌ఎఫ్‌ఎస్) వార్షికోత్సవం జరుగుతుందని అధ్యక్ష, కార్యదర్శులు ఆదిమూలం సాయిబాబా, ఎంవీ అయ్యన్న తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఇంద్రధనస్సు - 7 పేరుతో సినీ మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా తెలుగు ఇండియన్ ఐడల్ విజేత షేక్ నసీరుద్దీన్, రన్నరప్ శ్రీకీర్తి పాల్గొంటారన్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి కందుల దుర్గేష్, విశిష్ట అతిథులుగా ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాన రైల్వేస్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై ఓవర్ బ్రిడ్జి సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ స్టేషన్ ఎస్సై మావుళ్లు తెలిపారు. అతడి వయసు సుమారు 38 ఏళ్లు ఉంటుందన్నారు. ఒంటిపై నీలం రంగు చొక్కా, అదే రంగు జీన్స్ ప్యాంట్ ఉన్నాయన్నారు. అతడి గురించి మరే ఇతర వివరాలు లభించలేదని తెలిపారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వం ఆస్పత్రి మార్చురీ రూమ్‌కు తరలించామన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 94406 27551, 94914 44022, 0833 2442821 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళలకు చీరలు, దుప్పట్ల వితరణ


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ప్రముఖులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీ హీరోలు వెంకటేష్, రానా పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. వెంకటేష్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీవీ హనుమంతరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ బట్లంకి ప్రకాష్, సురేష్ మూవీస్ మేనేజర్ జె.లక్ష్మణరావు, ఆర్‌వీ రెస్టారెంట్ అధినేతలు రాయుడు వెంకటస్వామి (బాబ్జీ), రాయుడు సతీష్ బాబు, శ్యామల థియేటర్ మేనేజర్ చిట్టిబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్యామలా థియేటర్ ఆవరణలో కేక్ కట్ చేశారు. థియేటర్ సిబ్బందికి స్వీటు బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అభిమానులు కె.జగదీష్ (చెర్రీ), జి.కైలాష్, ఎం.దేవీ శివప్రసాద్, టి.లక్ష్మీరాజ్, వియ్యపు కృష్ణ, సీహెచ్ గణేష్ పాల్గొన్నారు.

వారాహీదేవి పీఠానికి శంకుస్థాపన


శంకుస్థాపనలో పాల్గొన్న పామర్తి బాబూరావు దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులో వారాహీదేవి పీఠం నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన ఘనంగా జరిగింది. వివిధ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపకుడు పామర్తి బాబూరావు, విజయలక్ష్మి దంపతులు పీటలపై కూర్చున్నారు. బాబూరావు ఆధ్వర్యంలో స్కంద స్వామి పర్యవేక్షణలో పీఠం నిర్మాణం జరుగుతోంది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ అత్తిలి భీమ శంకరం, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ యామన నారాయణ, స్థానిక నాయకులు పిన్నమరెడ్డి ఈశ్వరుడు, అడ్డాల శ్రీను, ఆరవ రాజు, నల్లమిల్లి వెంకన్న బాబు, దండమూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	: పుష్ప-2
సూర్యమినీ	: పని
సూర్యప్యాలెస్	: మిస్‌యూ
స్వామి	: పుష్ప-2
అశోక	: పుష్ప-2
శివజ్యోతి	: పుష్ప-2
అనుశ్రీ	: పుష్ప-2
రాజా	: పుష్ప-2
ఊర్వశి	: మిస్‌యూ
మేనక	: అమరన్
రంభ	: ప్రణయగోదారి, సమిధ
కుమారి	: లక్కీ భాస్కర్
అప్సర	: పుష్ప-2
నామవరం	
వీఎస్ మహల్	: పుష్ప-2
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: పుష్ప-2
కడియం	
వెంకటసూర్య	: పుష్ప-2

ఆరోగ్యానికి అడుగులు

- వ్యాయామంపై ప్రజలకు పెరిగిన ఆసక్తి
- వాకర్లతో కిటకిటలాడుతున్న పార్కులు


పార్కులో వాకింగ్ చేస్తున్న ప్రజలు

ప్రకాశం నగర్: ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు చెప్పిన విషయం నూరుశాతం అక్షర సత్యం. ఆరోగ్యానికి మించిన సంపద లేదు. దాన్ని ఎల్లప్పుడూ కాపాడుకుంటూ ఉండాలి. గతంలో మనిషి శారీరకంగా శ్రమపడేవాడు. అది వ్యాయామంగా ఉపయోగపడి ఎటువంటి రోగాలు దరిచేరేవి కావు. నేడు సాంకేతికత బాగా పెరిగింది. అన్ని పనులు చాలా సులువుగా చేసుకునే వీలు కలిగింది. శరీరానికి ఏమాత్రం అలసట లేకుండా చాలా తొందరగా జరుగుతున్నాయి. దీన్ని వల్ల ప్రయోజనాలు ఉన్నప్పటికీ శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో నిత్యం వ్యాయామం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రజలకు కూడా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే ఆసక్తి పెరిగింది.

వాకింగ్ ట్రాక్‌లపై పరుగులు

కరోనా మహమ్మారి ప్రపంచాన్ని అతలాకుతలం చేసి, తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. అనంతరం ప్రతి ఒక్కరికీ తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకింగ్, జాగింగ్, సైకిలింగ్ వంటివి చేస్తున్నారు. మరికొందరు యోగా, జిమ్‌లకు క్యూ కడుతున్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం, ఎస్‌కేవీటీ కళాశాల గ్రౌండ్, స్టేడియంతో పాటు పార్కుల్లోని వాకింగ్ ట్రాక్‌లపై జనం పరుగులు తీస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళలో వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కృషి చేస్తున్నారు. వృద్ధులు, మధ్య వయసు కలిగిన వారితో పాటు యువత కూడా ఫిట్‌నెస్ కోసం పరుగులు తీస్తుండడం అభినందనీయం. ప్రతి రోజూ ఒక గంట వ్యాయామం చేయడం వల్ల శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుంది. ఆలోచన శక్తి కూడా మెరుగుపడుతుంది.

బరువు తగ్గడమే ప్రధాన లక్ష్యం

ఆధునిక జీవన విధానంలో మారిన ఆహారపు అలవాట్ల కారణంగా జనాభాలో అధిక శాతం మంది స్థూలకాయం సమస్యతో బాధపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువతీ యువకులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఫాస్ట్ ఫుడ్, కేక్‌లు, పిజ్జా, బర్గర్లు తదితర జంక్ ఫుడ్ కారణంగా స్థూలకాయం వచ్చేస్తోంది. చిన్న వయసులోనే పలు రోగాలు దరిచేరుతున్నాయి. బీపీ, షుగర్, గుండెజబ్బులు బాగా ఎక్కువయ్యాయి. గతంలో అరవై ఏళ్ల వయసులో వచ్చే జబ్బులు ఇప్పుడు పాతికేళ్లకే దాడి చేస్తున్నాయి.

నడకతో ప్రయోజనాలు

ప్రతి రోజూ నడక కారణంగా హైబీపీ, మధుమేహం, గుండె జబ్బులు, కొలెస్ట్రాల్, ఆందోళన, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు దరిచేరవు. ముఖ్యంగా చిన్నారులతో శారీరక శ్రమ కలిగిన ఆటలు ఆడించడం వల్ల వారిలో ఎదుగుదల బాగుంటుంది. మానసిక పరిపక్వత, ఏకాగ్రత పెరిగి మంచి ఆలోచన శక్తి వస్తుంది.

శ్రద్ధ పెరిగింది



జీవన శైలిలో వచ్చిన మార్పుల కారణంగా స్థూలకాయం సమస్య ఏర్పడింది. కరోనా అనంతరం ఆహారపు అలవాట్లు, వ్యాయామం, పరిశుభ్రత వంటి విషయాలపై ప్రజలకు అవగాహన వచ్చింది. ప్రతి ఒక్కరూ వ్యాయామంపై శ్రద్ధ చూపుతున్నారు. ఇది అభినందించాల్సిన విషయం. శారీరక శ్రమ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు మరింత అవగాహన కల్పించాలి.

– ఏవీడీ ప్రసాద్, పీడీ

నేడు, రేపు రాష్ట్ర స్థాయి సమావేశాలు

సీటీఆర్ఐ: ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో విజయవాడలో రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించనున్నారు. ఆ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్జరపు రమేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కమతం అనిల్ శుక్రవారం ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు. విజయవాడలోని సిద్ధార్థ అకాడమీలో 14న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో 15న తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ సమావేశాలు జరుగుతాయన్నారు. ముఖ్య అతిథిగా జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా, అతిథులుగా సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యామ్ ప్రసాద్, సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు తాళ్లూరి విష్ణువు, ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ పరశురాం, రాష్ట్ర అధ్యక్షుడు గరికి ముక్కు సుబ్బయ్య హాజరవుతారన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో వేదిక హక్కులు, ఆశయాల గురించి వివరిస్తారన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ, తీర్మానం చేస్తారన్నారు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

రైల్వే క్యాంపు కోర్టు పునఃప్రారంభం

- 666 కేసుల్లో రూ.2.60 లక్షల జరిమానా విధించిన జడ్జి
- ఇక నుంచి ప్రతి శుక్రవారం నిర్వహణ


రైల్వే క్యాంపు కోర్టుకు వచ్చిన న్యాయమూర్తి ఆర్‌వీ శర్మ

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని రాజమహేంద్రవరం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బి.సైదయ్య హెచ్చరించారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ పరిధిలో శుక్రవారం రైల్వే క్యాంపు కోర్టు నిర్వహించారు. ఈ సందర్భంగా 666 కేసులను ప్రవేశ పెట్టగా న్యాయమూర్తి ఆర్‌వీ శర్మ రూ.2,60,700 జరిమానా విధించారు. నో పార్కింగ్, దివ్యాంగులు, మహిళల బోగీలలో అనుమతులు లేకుండా ప్రయాణించేవారు, స్మోకింగ్ చేస్తూ పట్టుబడిన వారికి ఈ జరిమానాలు విధించారు. కరోనాకు పూర్వం రాజమహేంద్రవరం కేంద్రంగా ప్రతి శుక్రవారం రైల్వే క్యాంపు కోర్టు నిర్వహించేవారు. కరోనా కారణంగా దీన్ని ఎత్తి వేశారు. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ పరిధిలో జరిగే కేసులను విజయవాడ కోర్టుకు ఆర్పీఎఫ్ అధికారులు తరలించేవారు. చాలాఏళ్ల తర్వాత శుక్రవారం మళ్లీ ఈ క్యాంపు కోర్టును ఏర్పాటు చేశారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం నిరివ్రామంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. కాగా.. రైల్వే క్యాంపు కోర్టు పునఃప్రారంభం సందర్భంగా కోర్టు ఆవరణలో న్యాయమూర్తి శర్మ మొక్కలు నాటారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం


బిషప్ విజయరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘస్తులు


పొట్టిలంకలో క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతున్న క్రైస్తవ ప్రముఖులు

సీటీఆర్ఐ: నిన్ను వలే నీ పొరుగు వారిని ప్రేమించాలని ప్రభువైన క్రీస్తు చెప్పిన మాటలను అందరూ పాటించాలని బిషప్ డాక్టర్ ఎస్.విజయరాజు అన్నారు. శానిటోరియం సమీపంలోని బైబిల్ మిషన్ స్వస్థత శాలలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిని స్టార్లు, విద్యుద్దీపాలతో అలంకరించారు. విజయరాజు మాట్లాడుతూ ప్రపంచంలోని క్రైస్తవులందరూ సంతోషంతో జరుపుకొనే పండగ క్రిస్మస్ అన్నారు. అనంతరం సంఘస్తులకు విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పి.వసంత కుమార్, కె.సత్తిబాబు, కె.దాస్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టిలంకలో..

కడియం: పొట్టిలంకలోని బైబిలు మిషను సెయింట్ దేవదాసు పెనుయేలు ప్రార్థనా మందిరంలో చిక్కాల పాల్ దొరబాబు నిర్వహణలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ బేతెస్థ స్వస్థత శాల నిర్వాహకుడు విమలా ఏసురత్నం మాట్లాడుతూ అందరూ విశ్వాసం, విధేయతతో ఏసుక్రీస్తును ఆరాధించాలన్నారు. డి.రత్నరాజు మాట్లాడుతూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్యాండిల్ లైట్ సర్వీసు, కేక్ కట్ చేశారు.

ఎస్సీ వర్గీకరణతో దళితులు బలహీనం

- ఈ నెల 15న నల్లపాడులో సభ
- వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జేఏసీ చైర్మన్ దేవీ ప్రసాద్


సమావేశంలో పాల్గొన్న దేవీప్రసాద్, హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: ఎస్సీ వర్గీకరణ దళితులను శక్తిహీనులుగా, బలహీనులుగా చేస్తుందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జేఏసీ చైర్మన్ ఉప్పలాటి దేవీ ప్రసాద్ పిలుపు నిచ్చారు. రాజీవ్‌గాంధీ డిగ్రీ కళాశాలలోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ ఈ నెల 15వ తేదీన గుంటూరు జిల్లా నల్లపాడులో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. మాలలందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని ముట్టుకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఆగస్టు ఒకటో తేదీన ఎస్సీ వర్గీకరణపై భిన్నమైన తీర్పు ఇచ్చిందని, దాన్ని తామందరం వ్యతిరేకిస్తున్నామన్నారు. వర్గీకరణపై రాష్ట్రాలకు అధికారం లేదని గతంలో సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందన్నారు. ఈ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, దీనివల్ల ప్రతి కులం నష్టపోతుందన్నారు. క్రిమిలేయర్ అనేది అర్థరహితమని, దాన్ని రద్దు చేయాలన్నారు. మాజీ ఎంపీ హర్ష కుమార్ మాట్లాడుతూ నల్లపాడులో జరిగే మాలల గర్జనకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. ఈ సభకు వెళ్లడానికి ప్రభుత్వం ఆర్టీసీ బస్సులు కూడా ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని అతిక్రమించి సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, దీని వెనుక ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర ఉందన్నారు.

వైభవంగా హనుమద్ర్వతం


కడియంలో పూజలు చేస్తున్న భక్తులు

కడియం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శుక్రవారం హనుమద్ర్వతం నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామివారికి పంచామృతాభిషేకాలు, తమలపాకులు, సిందూరంతో ప్రత్యేక పూజలు జరిపారు. కడియం, కడియపులంక, దుళ్ల, వీరవరం, మాధవరాయుడుపాలెం, మురమండ, దుళ్ల, జేగురుపాడు గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు.

కడియం నర్సరీలు

శ్రీఈశ్వరఫామ్ నర్సరీ	తాడాల విష్ణుచక్రవర్తి సన్స్	9440536611
శ్రీ ఈశ్వర నర్సరీ	తాడాల వీరాస్వామి (పెదకాపు)	9948417279
	తాడాల వీరన్న	9392452224
	తాడాల సత్యనారాయణ	9440444997
డాల్ఫిన్ నర్సరీ	తాడాల వీరవెంకట్రావు(బాబ్జి)	9989053949
ఉదయసిరి నర్సరీ	ఈలి సత్తిబాబు	9493338884
శ్రీవీరవెంకట శ్రీనివాసా నర్సరీ	పాటంశెట్టి వెంకట్రాయుడు	9440530534
శ్రీకోదండరామ నర్సరీ	వరదా రామకృష్ణ, బ్రదర్స్	9440361472
శ్రీ స్వాతి నర్సరీ	చిలుకూరి త్రిమూర్తులు	9866414104
శ్రీ వి.వి. సత్యదేవ నర్సరీ	కొత్తపల్లి రాముడు, బ్రదర్స్	9440530515
వసుంధర నర్సరీ	అడపా వెంకటేశ్వరరావు, సన్స్	9966545871
శ్రీ సీతారామ నర్సరీ	తానింకి నాగేశ్వరరావు, బ్రదర్స్	9440156724
స్వామీస్ నర్సరీ	కంచుమర్తి నాగేశ్వరరావు, బ్రదర్స్	9440846158
గోకుల్ నర్సరీ	దండుబోయిన వి.వి. సత్యనారాయణమూర్తి	9440339445
శ్రీ శ్రీనివాసరైతు నర్సరీ	సుంకర గోవిందు	9440444797
శ్రీ వేంకటేశ్వర నర్సరీ	తాడాల కొండయ్య	0883 2453334
శ్రీ రామా నర్సరీ	రత్నం వీరభద్రరావు	9399997977
తాళం నర్సరీ	తాళం సత్యనారాయణ	9849987577
గోదావరి నర్సరీ	తూపాటి వీరబాబు	9849550096
శ్రీ వెంకటసత్యనారాయణ నర్సరీ	పాటంశెట్టి ఆదినారాయణ	9908249414
శ్రీ వెంకటదుర్గా నర్సరీ	పాటంశెట్టి వాసు	9440175930
శ్రీ హేమా గార్డెన్స్	నాళ్ళ వేణుగోపాల్	9704911144
శ్రీ సత్యనారాయణ నర్సరీ	నాగిరెడ్డి సూర్యారావు, సన్స్	9966485558
సత్యం నర్సరీగార్డెన్స్	పాటంశెట్టి చినమహాలక్ష్మినాయుడు, సన్స్	9849666439
శ్రీ రాజరత్నం నర్సరీ	కొత్తపల్లి గంగరాజు, సన్స్	9849640655
శ్రీ గోవిందా నర్సరీ	కడియం నారాయణరావు, బ్రదర్స్	9010050720
శ్రీ వెంకటసాయి నర్సరీ గార్డెన్స్	ఉప్పులూరి వీరాస్వామి, సన్స్	9030183889
శ్రీ దుర్గా శ్రీనివాసా నర్సరీ	పాటంశెట్టి నాగేశ్వరరావు, సన్స్	9912711910
శ్రీ వెంకటదేవినర్సరీ	పాటంశెట్టి శ్రీనివాసరావు	9440463503
శ్రీ సత్యరామయ్య నర్సరీ	పాటంశెట్టి రామయ్యగారి సత్యనారాయణ, సన్స్	9440341887
శ్రీ రాజేశ్వరి నర్సరీ	పాటంశెట్టి సుబ్బారావు, సన్స్	9948227726
శ్రీ శివరత్నగణపతి	గెద్దం ఆదినారాయణ, సన్స్	9849178899
శ్రీ వీరభద్రనర్సరీ, గార్డెన్స్	కొత్తపల్లి వెంకటేశ్వరరావు	9441026375
శివరామనర్సరీ, శివరామ ఫ్లవర్ మర్చంట్స్	పాటంశెట్టి రామారావు సన్స్	9441044078
శ్రీ రామసాయి నర్సరీ	బీవీవీ సుబ్రహ్మణ్యం	9948075239
శ్రీ వెంకట రమణ నర్సరీగార్డెన్స్	దర్మాసనం గోవిందరాజు, సన్స్	9440338116

భూ వివాదాల పరిష్కారానికే సదస్సులు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ జయసూర్యకుమార్

రాజమహేంద్రవరం రూరల్: భూవివాదాల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి కేఎన్ జ్యోతి అన్నారు. కాతేరు గ్రామపంచాయతీ కార్యాలయంలో రెండవరోజు శుక్రవారం కాతేరు, వెంకటనగరం గ్రామాల సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ జయసూర్యకుమార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుకు 14 అర్జీలు వచ్చాయన్నారు. కాతేరు గ్రామంలోని ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను తొలగించాలని గంగిన హనుమంతరావు, నిషేధిత భూముల జాబితా నుంచి తమ స్థలాన్ని తొలగించాలని అంజూరి వీర వెంకట సత్యనారాయణ అర్జీలు దాఖలు చేశారన్నారు. ఈ అర్జీలను 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.

ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ తనిఖీ


పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్య కిషోర్

ధవళేశ్వరం: వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌ను రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ కె.భవ్యకిషోర్ సందర్శించారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలగాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలన్నారు. కేసుల నమోదు, ప్రగతిపై చర్చించారు. వివిధ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలించారు. ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సీఐ టి.గణేష్, ఎస్సైలు క్రాంతి కుమార్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధమే కథాంశం


సమావేశంలో పాల్గొన్న దర్శకుడు ప్రసాద్, నిర్మాత శ్రీనివాస్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అన్నాచెల్లెళ్ల అనుబంధమే కథాంశంగా ప్రేమాయణం కేరాఫ్ ధర్మవరం సినిమాను తెరకెక్కిస్తున్నామని దర్శకుడు ఫేమస్ ప్రసాద్, ప్రొడ్యూసర్ పెంకే శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం ఆనంద్ నగర్‌లోని చిత్ర యూనిట్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సినిమాను ఓటీటీలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. పూర్తిగా కొత్త నటులతో తీస్తున్న చిత్రమని వివరించారు. పాత కథ అయినప్పటికీ చిత్రీకరణలో కొత్తదనం ఉంటుందన్నారు. అన్నాచెల్లెళ్ల ఆప్యాయత ఏ విధంగా ఉంటుందో ఈ చిత్రం ద్వారా ప్రేక్షకులకు చూపిస్తామన్నారు. లోకల్ టాలెంట్‌ను ప్రోత్సహించాలని ఉద్దేశంతో స్థానిక యువకుడు మణి నాగేంద్ర (ఎన్ఎస్)ను హీరోగా ఎంపిక చేశామన్నారు. కోనసీమ జిల్లా ముక్తేశ్వరంలో కనుమ రోజు సినిమా షూటింగ్ ప్రారంభిస్తామని వెల్లడించారు. సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ మారెళ్ల సుగుణ, విలన్ ఎస్ఎస్ శేఖర్, ఫేమస్ సతీష్, దేవి, గోదావరి విజయ్, వి.పండు, జై సతీష్ గణేష్ పాల్గొన్నారు.

రూ.17.40 లక్షల విలువైన ఎరువులు సీజ్

సీతానగరం: రఘుదేవపురంలోని రెండు ఎరువుల షాపులపై శుక్రవారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేశారు. ఈ సందర్భంగా రూ.17.40 లక్షల విలువైన 1,535 ఎరువుల బస్తాలను సీజ్ చేశారు. గ్రామంలోని లక్ష్మీ వెంకటేశ్వర జనరల్ స్టోర్స్ అండ్ ఫెర్టిలైజర్స్, వెంకట మోహన్ ట్రేడర్స్ ఎరువుల షాపులలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ స్నేహిత, డీసీటీవో నవీన్ కుమార్, సీఐ మధుబాబు తదితరులు తనిఖీలు చేశారు. స్టాక్, బిల్లులు, రిజిస్టర్లలో వ్యత్యాసాలను గుర్తించారు. అనంతరం ఇన్‌చార్జి ఏవో రామ తులసి విలేకరులతో మాట్లాడుతూ లక్ష్మీ వెంకటేశ్వర జనరల్ స్టోర్స్ అండ్ ఫెర్టిలైజర్స్ షాపులో రూ.8,30,663 విలువైన 772 ఎరువుల బస్తాలు, వెంకట మోహన్ ట్రేడర్స్‌లో రూ 9,10,200 విలువైన 763 బస్తాలను సీజ్ చేసినట్టు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది శివ, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ మృతి


సత్యనారాయణ (ఫైల్)

కడియం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కేవీవీ సత్యనారాయణ (55) శుక్రవారం మధ్యాహ్నం ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గుండె సంబంధ సమస్యలతో ఈ నెల 9వ తేదీ నుంచి ఆయన చికిత్స పొందుతున్నారు. సత్యనారాయణకు భార్య వెంకట సూర్యకుమారి, తల్లి సత్యవేణి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పిల్లలిద్దరికీ వివాహాలు అయ్యాయి. సత్యనారాయణ పార్థీవదేహాన్ని రాజమహేంద్రవరం నారాయణపురంలోని ఆయన స్వగృహంలో ఉంచారు. కుమార్తె, అల్లుడు దుబాయ్‌నుంచి రావాల్సి ఉందని, శనివారం ఆయన అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తామని జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఆర్.రఘురామ్ తెలిపారు. కాగా.. హెడ్ కానిస్టేబుల్ మృతికి సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిశోర్, కడియం ఇన్‌స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావు, ఎస్సైలు, సిబ్బంది సంతాపం తెలిపారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితం

స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ నాగమణి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ

బిక్కవోలు: ఇష్టపడి చదివితే ఫలితం ఉంటుందని స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ ఎం నాగమణి అన్నారు. శుక్రవారం మండలంలోని పందలపాక గ్రామంలో పడాల పెద్ద పుల్లారెడ్డి జెడ్పీ హైస్కూల్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉన్నత, హైస్కూల్ ప్లస్ విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించగలరన్నారు. భవిష్యత్తుకు తొలిమెట్టు పదో తరగతే అన్నారు. చదువుతో పాటు, ఆరోగ్యం కూడా అవసరమని, అందుకు నిత్యం 30 నిమిషాలు యోగా చేయాలన్నారు. ఆమె వెంట హెచ్ఎం చిర్ల వీరరాఘవరెడ్డి, అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల సత్తి రాజు, పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి ఉన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

సీతానగరం: బాలికను ఇంటి నుంచి తీసుకుపోయిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. చినకొండేపూడికి చెందిన బాలికకు దగ్గర బంధువు అయిన దేవరపల్లి మండలం కృష్ణపాలేనికి చెందిన చాపల దుర్గాప్రసాద్‌తో పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో బాలికను ఇంటి నుంచి అతడు తీసుకపోయాడు. తన కుమార్తెకు మాయమాటలు చెప్పి దుర్గాప్రసాద్ కృష్ణపాలెం తీసుకువెళ్లాడని బాలిక తల్లి పోలీసులు ఫిర్యాదు చేసింది.